

# సుప్తసౌందర్యం

(పెద్దకథ)

' రమణశ్రీ "

ప్రకృతి నిజనిజాల పారిసర్యాన్ని గుర్తించి, వర్తించే నడత మానవుడిలో, ఎంతవరకూ నిబిడీకృతమైవుంది?-అంతా తెలిసివుండీ ప్రసాదరావు అజ్ఞానంతో ఎందుకు ప్రవర్తిస్తుంటాడు? ఏ ముడిపదార్థాన్ని, ఆ ముడిపదార్థ తత్తుల్యంగానే గ్రహించి, వేదాంతం వేదాంతంగా, ఆధ్యాత్మికతని ఆధ్యాత్మికతగా నైజసుఖాన్ని ప్రకృతి సుఖంగా భావించుకొని, అనుభూతిలో ఇముడ్చుకొంటూ సాగిపోతోన్న తన జీవికని ఏ లక్ష్యమో అలక్షించింది!-ఇంతకీ కారణం-ఒకచిన్న మానసికమైన సంఘర్షణ. బంగాళాఖాతపు సుడిగుండంలో తుఫాను తన బంగళాలోకి సహితం నోరుతెరుచుకుని హోరుమని వీచింది. సావిత్రి గర్భంలో మెదుల్తోన్న చిన్ని పాపకి యీసంగతంతా ఏంతెలుసు?...తన తల్లి తనని వద్దంటోందని!

విసుక్కుంటూ, కసుక్కుంటూ సావిత్రి, ప్రసాదరావుముందు ప్రత్యక్షరాన్ని సాగదీసి, ఉఫ్‌మని ఊదుతూ మాట్లాడింది. ఆ పలుకుల్లో పరమార్థాన్ని ములుకులతో పోలిక తెచ్చుకుని, ప్రసాదరావు కిమ్మనలేదు.

"అప్లికేషను పెట్టేగా. వచ్చే వారంలోనే ఉద్యోగయోగం" అంది సావిత్రి. ప్రసాదరావు తల బరువెక్కింది. ఆడవాళ్ళకు ఉద్యోగాలివ్వడంలో ఇండియాప్రభుత్వం ముందంజవేసింది. ఇక ఆనందమైనదైతే...ఏదో నవీన కవి భావం స్ఫురించినట్టు పెదవి వంపులో నవ్వుని తుంచి పారవేశాడు. సావిత్రి మనసులో భావావేశాన్ని జడవంపుతో త్రిప్పుతూ, "మీరెవాళ్లు తంటాలుపడితే వుద్యోగం వచ్చింది?"- వెటకారం, అహంకారం, స్త్రీకారం స్పష్టంగా వాక్కుల్లో గోచరింపచేస్తూ, "ఆడవాళ్ళకిస్తేటే వుద్యోగం" అంది.

సావిత్రి మాటల్ని జీర్ణించుకునే శక్తిలేక ప్రసాదరావు ఊరుకున్నాడు. భార్యకి ఉద్యోగం దొరికితే తన ఉద్యోగం ఊడదుగదా? నలుగురూ నవ్వుతూ, "ఇంకేం! పెళ్ళాన్ని కూడా ఉద్యోగంలో పెట్టావుగా" అంటారు. నడవలోంచి, గదిలోకి వెళ్ళాడు. దీపం మండుతోంది. కిరసనాయిలందక వత్తి బొడ్డుగడుతోంటే చూస్తూ వూరుకున్నాడు. కాంతిలేని మసకలో, నిలువుటద్దంఎదురుగా ఆమె మొహాన్ని తన మొహానికి చూపెడుతోంది.

గుండె గతుక్కుమంది. తన స్వరూపంతో తను పెనుగులాడాడు. "ఉద్యోగం చెయ్యకపోతే యేం?" వెంటనే జవాబు, జడలో పువ్వు విసిరినట్టు వచ్చింది.

"సరదా. ఉద్యోగం స్త్రీలక్షణం కూడా. చదువుకొన్నందుకు సార్థకం?"

"యూరోపియన్ హాస్పిటల్లో మంత్రసానికిందా?"

"కలెక్టరాఫీసులో మీరు గుమాస్తాకిందా?" అంది.

సావిత్రి నవ్వదు. నవ్వినట్టుంటుంది. ప్రకృతిని జయించినట్టు, భర్తమీద తన కధికార ప్రాబల్యమున్నట్టు, ఆ నవ్వులో అంతరార్థాలు. తన హక్కులకోసం తనెందుకు పోరాడకూడదు? భర్త సాన్నిధ్యంలో ఆడది పదిమంది చూస్తుండగా కాళ్లు పట్టాలనే పతివ్రత కాదు సావిత్రి. "సమానాధికారాల్ని నా పుట్టుకతో తెచ్చుకొన్నా. ఏమంటావ్?" అంటుంది.

ఈ ప్రకృతిని, ప్రసాదరావు జయించలేకపోయాడనైనా అనాలి. లేక స్వతంత్ర మానసిక

శక్తులతో పోరాడాడనైనా అనాలి. ఈ రెండూ అనలేకపోతే, ప్రసాదరావు సావిత్రి సౌందర్యావధుల్లో పిచ్చివాడయ్యాడనైనా అనాలి-కాని నిజానికి, ప్రసాదరావు అబద్ధాలాడే మనిషి. ప్రతీ చిన్నవిషయానికి, స్వాభావికమైన అబద్ధం ఆడుతూంటాడు. ఇది అబద్ధమని నిజం తెలిస్తే అతణ్ణి మంచివాడని ఎవరంటారు? అందుకే సావిత్రి లాఘవంగా అతన్ని అబద్ధాలాడనిచ్చి, నమ్మినట్టు నటించింది.

సావిత్రి మంత్రసాని పదవి-సావిత్రి అంతర్వ్యక్తిత్వం నవ్వుతూ నాలుగూ మాటాడుతోంటే, హఠాత్తుగా, ఈ రెండు వాక్యాలు జ్ఞాపకంతో పలకరించి, పులకరించేవి. పిల్లల్ని కంటే పెంచుతుందా? పెంచి పెద్దవాళ్ళను చేయగలుగుతుందా? చేస్తుంది చెందుతుంది. విసుక్కుంటూ కసుక్కుంటూ ప్రేమలేని పెంపకంలో, తన అహంకారాన్ని, వాళ్ళ లేతహృదయాల్లో మొలకలెత్తిస్తుంది. తన సౌందర్యాన్ని, యౌవనాన్నీ జీవితాన్నీ ధ్వంసంచేస్తారని మేలుకొని ఏదో అంటుంది. "వద్దు బాబూ నాకీ బెడదలు. నా నెత్తిన పెట్టకండి! నేనీ బరువు మోయలేను. కళ్ళారా చూస్తున్నాను." మొదటిసారి మాట్లాడినపుడు ఈ ధోరణి ప్రసరించింది.

ప్రసాదరావు నవ్వాడు. నవ్వు నాల్గువిధాల చేటని తనకి తెలుసు! ఇప్పుడు! వచ్చిన గర్భాన్నయినా ఛిద్రం చేస్తానంటుంది. ఆడవాళ్ళకి చదువు పెద్దవాళ్ళే వద్దని, మూర్ఖులై అన్నారని, భ్రమపడ్డాడు ప్రసాదరావు. ఎంతదాకా వాళ్ళ నిజాన్ని మాటగట్టుకోకుండా అన్నారో గ్రహించసాగాడు. "నేను కనలేను, పెంచలేను" అని ఏ భారతగృహిణి అన సాహసించగలదు? ఇప్పుడు నిరోధించి, విరోధించడ మెందుకు? వద్దన్నాడు. అదే తుఫాను! కళ్ళల్లో మేఘాలు! గుండెల్లో రాగాలు! వీటి సంఘర్షణాజన్యమానంగా తుఫానుని ఎదుర్కొంటుంటే సావిత్రి తనని వేళాకోళం చేస్తుంది.

తన యౌవనం బలపడుతూన్నప్పటినించీ, ప్రసాదరావులో స్త్రీమీద నిశ్చలమైన అభిప్రాయాలు లేర్పడసాగినయ్! అవి ఆదర్శవంతంగా సావిత్రికి చెప్పాలనే గూర్చాడు. అయితే నిద నించి మేల్కొన్నప్పుడు వాటి ప్రాముఖ్యాన్ని మరిచిపోయేవాడు. సావిత్రిని పెళ్ళి చేసుకున్నాడు గాని, ప్రేమించలేదు. అయితే తన ఆదర్శాలు, ప్రేమించి పెళ్ళి చేసుకున్నప్పుడే అదృష్ట దృష్టాంతంగా పనిచేస్తాయి. అలాంటి అవకాశాన్ని తెగిన ఆకాశంలోకి చూస్తూ తను బ్రతుకుతున్నాడు. స్త్రీపట్ల ప్రేమ సాధించలేని ప్రేమికులంతా కాలవాహినీ తరంగాలలో ఎలా లీనమై, జీవితాన్ని అమరం చేసుకుని, అనుభూతిలేని వాంఛకి తిలోదకాలిచ్చి, దాన్ని అమరప్రేమనీ, వాస్తవిక ప్రేమనీ తిలకందిద్దుతారు! వాళ్ళంతా పేరుప్రఖ్యాతులకోసం అలా చేయలేదనేవారికి, వారిమీదకలిగే సానుభూతి నిజమైన అనుభూతి! ఇంతకీ తనుసాధించేదేముంది?—భయం వెనుక మృత్యువుదాక్కొని తనభీకరమైన కోరలనైశిత్యం చూపెడుతుంది.

సావిత్రి సువార్తచెప్పడం, తనువినడం, ఉద్యోగంలో ప్రవేశించడం—అన్నివిషయాలకీ విధి వ్యతిరేకించలేదు.

అయితేయేం? సావిత్రిలో సుడిగుండం తిరగడం మొదలుపెట్టింది. రోజూ డ్యూటీకి వెళ్ళడం వలన దాంపత్యంలోవుండే ఆనందాన్ని పంచుకోలేకపోతూ ప్రసాదరావు సాన్నిహిత్యం అభిలషించలేక పోతోంది!... అయితేనేం? తను ఓడిపోలేదు...

"ఉద్యోగాన్ని మానేయరాదూ?"

ఎప్పుడుపాడినా యిదేపాట! ప్రసాదరావు పాటకి, శ్రుతీ, లయ సంగీతం అన్నీ సమకూడి, సావిత్రిచెవుల్ని గింగురులెత్తించేది. ఆ రోజున హోటల్లో ప్రసాదరావు సాంబారు మెతుకులు తింటూ సావిత్రి తత్త్వానికి తనుతాళంవేయలేకపోవడాన్ని గురించి, ఆలోచించేవాడు. సావిత్రి క్రోధానికి తనకిహోటలుశిక్ష తప్పదు. అయితే తననిగుండెల్లో సుడిగుండాలు త్రిప్పుతూ పరిభ్రమింపించేది!

గర్భాన్ని ఛిద్రపరచడానికి, ఆ మెలో భగీరథుడనేకావతారాలెత్తాడు.) నలుగురూ, నాలుగు చీవాట్లువేశారు— ఇది రహస్యంగా దాగినా ప్రసాదరావుకి తెలీకపోలేదు. పరిహారమాత్రం

వాంఛించని ఆంధ్ర స్త్రీ వుండదనుకొన్నాడు. ఉంది! తన్ని కికురిస్తూవుంది!

ప్రసాదరావు మాటలు సావిత్రికి వేళాకోళం కాసాగినయ్! భయపెట్టసాగింది. అందుకే విధికి వదిలేశాడు. కాలం ధర్మకర్మపరిశౌచమైనపుడు, పాములూ, జెర్రులూ, తేళ్ళూ, కాళ్ళమీదికివచ్చి అడుకొని విషావయవాలతో స్పృశించి, వెళ్ళిపోతయ్! "మనం ప్రతిఘటించనిదే విధి"—అని ఎవరో మహానుభావుడంటాడు. ప్రసాదరావు ఈ వాక్యంలో పరమార్థంకోసం బుర్ర బద్దలు కొట్టుకున్నాడు.

ఇప్పటి కప్పుడే మూడు నెలలయింది, తను మంత్రసానిపదవి పుచ్చుకొని—పది పదిహేను పురుళ్ళుపోసింది. బొడ్డుకోసి, బిడ్డని, తల్లినించి వేరుచేస్తూండేటప్పుడు, ప్రవహించే రక్తంవిలువల్ని సుదీర్ఘంగా ఆలోచించేది. నలుగురూ సావిత్రి చేతిచలువన్నారు. వాళ్ళలా అంటుంటే లోలోపల ఉప్పొంగిపోయి, పైకి ఏవగించుకొనేది. తనమనసులో వాళ్ళగురించి అభిప్రాయాలు పొరలుగా ఏర్పడసాగినయ్. ఆ పొరలింకా దట్టమవుతూంటే వాళ్ళనిచూచి నవ్వుకొనేది.

రోజుల్ని కాలం మింగుతూన్నకొద్దీ నెలలు నిండుతుండేసరికి సావిత్రికి గర్భం దుర్భరం కాసాగింది. ఇట్టే అంటువ్యాధులికి గురవుతూ విశ్రాంతిరహితంగా నానాబాధలూ పడింది. వారంరోజులు కడుపులో శూలపోట్లు బయల్దేరినయ్. కోటిగొడ్డళ్ళతో ఒక్కసారి తనగర్భాన్ని మోదినట్టు. ఒక్కొక్కపోటు జ్ఞప్తికి తెచ్చింది. మహాయాతగిలి, భయంకరమైనచలిని, ప్రళయాన్ని భరించినట్టు భరించితీరింది.

ప్రసాదరావు కంటికి రెప్పలా ఆమెను చూడ్డానికి ఎంత ప్రయత్నించినా లాభంలేకపోయింది. పదిహేనురోజులికిగాని బాధ ఉపశమించలేదు. డాక్టరు ప్రత్యేకశ్రద్ధతో చూచి ప్రసాదరావు భుజం తడుతూ, "అదృష్టం నీది"—అన్నాడు. ఇక హాస్పిటల్లోనే వుండిపోసాగింది సావిత్రి. ప్రసాదరావుని మళ్ళీ హోటలు వరించింది.

తొమ్మిదినెలలూ నిండాక, సావిత్రి మగపిల్లవాణ్ణి కన్నది. తనకి అసహ్యమేసింది, అంతా ఆనందిస్తోంటే! తనెన్ని దుర్భరబాధలకి గురయింది? ఎంతగా ప్రాణం పణంవొడ్డి ఈ పిల్లవాణ్ణి కంది?- అందరికీ ఎందుకు సంతోషం?—అందుకే తను పరమఅసహ్యంతో బాధపడింది! తనుబాధపడికంటే, వీళ్ళకి సంతోషమా?

ప్రసాదరావు తనదృష్టిలో అలుసయ్యాడు. అతన్ని ఓడించాననుకుంది. తను కాదన్నది అతను అవునన్నాడు. పగ సాధించడానికి ఎవరో మనసులో ఊహారజ్జువు బిగించారు. తనది ఊహ. అందరికీ అపోహ. తనెవరికైనా అవమానం చేస్తున్నదా?— ఈ అనుమానాన్ని గుండెల్లోంచి విశ్వాసఘాతుకుడైన సేవకుణ్ణి గెంటినట్టు గెంటింది. అయితే ప్రసాదరావు తన ఊహల్ని చించి పారవేసి, "ఇదిగో ఇది నంగనాచి. దొంగదుం~." అని గేలిచేస్తాడేమో... ఒకళ్ళనొకళ్ళు మోసం చేసుకుని బ్రతకడమే—జీవితానికి పరమావధి. చివరికంతా వినాశం ప్రకృతిపరమావధి. ప్రకృతి మనల్ని సంతానంకోసం బతకనిస్తుంది. కనలేని వాళ్లని సమాజంచేత తిట్టిపోయిస్తుంది. ఆ సంతానాన్ని పొందడంతోతే తనపెదవుల సంధ్యారాగంలో, తన కనుగొలకుల చీకటికాటుకలో నేత్రతారల మిలమిలలలో విలీనంచేసుకుని ముందుకు సాగిపోతుంది. "ప్రకృతిలో పుట్టి, ప్రకృతిలో బ్రతికి సహజప్రకృతిలో లీనమైపోవు ప్రకృతిగర్భి"నవాళ్లం మనం!—ఈ రహస్యాన్ని చెప్పని మనిషుండడు. కవివుండడు. శాస్త్రకారుడుండడు. వేదాంతి వుండడు. అంతా అందరికీ తెలుసు. అయితే, అంతా తెలిసిన నటన!

ప్రసాదరావుని గుణంలో అందరూ గౌరవిస్తారు. ఎటొచ్చీ ప్రేమించనిది సావిత్రి. సావిత్రి అందరూ ప్రేమించేదాన్ని ప్రేమించలేదు. వెలుగుని ద్వేషిస్తుంది. చీకటిని అన్వేషిస్తుంది. వెలుగుని చూచినపుడు దివాంధంవలె కళ్లు మూసుకుని శపిస్తుంది. చీకటికి తపిస్తుంది. ఈ సత్యాన్ని విడమర్చి చెప్పడానికి సావిత్రి హృదయమే ఒక ఉద్గ్రంథం.—తను సాహసంగా సంఘానికెదురీదుతుంది. సంఘాన్ని, సమాజాన్ని, "నీసంకెళ్ళు నాకెందుకు? వ్యక్తులమీద శక్తులమీద నీకేమధికారంవుంది? నువ్వెవరవు నన్నాటంకించడానికి?" అని ప్రశ్నిస్తుంది. సమాజానికి సంకెళ్ళకి భయపడే భీరువుల్ని చూచి నవ్వుతుంది. పెదవులకి

కొంగు అడ్డంపెట్టుకొని నవ్వుతోంటే సమాజానికి తమమీద మన్మథబాణాలు విసురుతోందా అనిపిస్తుంది.

దీనికి నిదర్శనం-ప్రదర్శనంలోనే వుంటుంది. నిదర్శనాలనేవి అందరూకోరే న్యాయాలు. ఈ న్యాయం అన్యాయం కనిపించినా, కంటిరెప్పలు క్రిందికి దించి, నల్ల కళ్లద్దాల వెనుకనుంచి, రహస్యంగా చూచి తృప్తిపడతారు.

పిల్లవాణ్ణి, ఇంటికితీసుకొచ్చారు. నలుగురూ చూచారు. సావిత్రిదగ్గర ఏ మాటా అనలేక వెళ్ళిపోయారు. సావిత్రి ఎవ్వరూ చూడకుండా దిష్టి తగిలిందేమో అని దిష్టితీయడం, తనకే కొంత వింతనిపించింది. ఇంటిప్రక్క కృష్ణవేణమ్మ మాత్రం, పిల్లవాణ్ణి చూసినప్పుడు, తన పొగడ్తని అగడ్తదాటించింది. ఆవిడ ప్రసాదరావుని మొదటిసారిగా అభినందిస్తూ తీర్మానంచేసింది.

ప్రసాదరావు గొప్ప అదృష్టవంతుడంది. ఆ అదృష్టానికి కారణంగా సావిత్రిని పేర్కొంటూ తనది ద్వితీయ స్థానంగా స్థానీకరించడం, ఈర్ష్యాస్వార్థాలతో సహా బయటపెట్టింది. తర్వాత కృష్ణవేణమ్మ వంశాన్ని జమకు తెచ్చి అభినందించింది. సావిత్రి ఆ మాటకి ఒప్పుకుంటూ నవ్వింది. కొందరి నవ్వు—కొందరి నవ్వేం? అందరి నవ్వూ-వాళ్ళవాళ్ళ మానసిక శక్తుల వ్యవస్థని బహిరంగపరుస్తుంది. ఆ నవ్వుతో గుణాన్ని నిర్గుణాన్ని కృష్ణవేణమ్మ గ్రహించలేకపోయింది.

ఏమోగాని, ఒక నెలయేసరికి సావిత్రిమళ్ళీ తన డ్యూటీకి వెళ్ళిపోసాగింది. తెలియని కారణంచేత తనదగ్గర పాలులేవు. కృష్ణవేణమ్మో మరెవరో దగ్గరకుతీసుకుని, పాలుపడుతూన్నపుడు తనకెంతో ఆనందంగా వుండి, గర్విస్తూ మనసులో మాత్రం భక్తిపూర్వకంగా నిట్టూర్చేది. అదేమిటోగాని, కొందరి నైజంలో విడిచే నిట్టూర్పులు ఓదార్పుగా బయటికి వినిపించవు. సావిత్రి నైజంలోనూ అంతేగాబోలు!

“పని మానుకోరాదటమ్మా”అంది కృష్ణవేణమ్మ.

“మీకిష్టంలేకపోతే మానేయండి! పిల్లవాణ్ణి ఆదుకునే శక్తి నాకులేకపోలేదు. నన్ను పని మానేయమనడానికీ, పిల్లవాణ్ణి పెంచడానికీ సంబంధమేమిటి?” అంది.

“ఊరికే అన్నానమ్మా! నా పుట్టిన బిడ్డగా చూచుకుంటాను”అంది తిరిగి—అలా అన్నందుకు సావిత్రికి భయపడుతూ.

సావిత్రి అనుకోవలిసిందేదో అనుకొని, ఊరుకొంది. తన పని ఒకళ్ళనెత్తిమీద పారేసి, అది సంస్కారం, నాగరికం గొప్పతనం అనుకోవడం సిగ్గుచేటు! అయితే, సావిత్రిమీద వీటి ప్రభావం లేదు...అభిమానం అన్నింటా దోహదంగావుండి, ప్రేమని సృష్టిస్తుంది. ఎక్కడైనాసరే ప్రేమని సృష్టించాలి. దానంతటది పుట్టదు. కొన్ని పదార్థాలమీద తన ప్రభావం గాఢంగా, నిరూఢంగా ప్రసరిస్తూంది సామాన్య మానవుడెవ్వరికీ 'ప్రేమ విలువలు తెలీవు. నిజంగా ప్రేమనేదే లేదేమో? అదంతా యథార్థమైన నటనేనేమో?...ఏ విషయాన్నీ నమ్మలేక, ఏదో వుందనుకోవడంలాంటిదే ప్రేమకూడా! ప్రసాదరావు, ప్రేమని నమ్మలేకనే సావిత్రిని ప్రేమించడం మానుకొన్నాడు. సావిత్రి కూడా అంతకంటె ఏమీ చేయలేకపోయింది. అయితే, ఎప్పుడయినా తన అహంకారం దెబ్బతిన్నప్పుడు మనస్సు భ్రమిస్తుంది. అందాల ఆకాశానికి చేరువగా, ఆదర్శాలకి అనువుగా కృత్రిమలోకాన్ని సృష్టించి, అందులో కాపురం పెడుతుంది.

పిల్లవాడు “క్యారు”మని ఏడ్చినంతమాత్రాన, కట్టు తెంచుకొని, పరుగెత్తే ఆవులాంటిది కాదు సావిత్రి. మాతృత్వాన్ని అపహసిస్తూ, పిల్లవాడు గుక్కపట్టి యేడ్చినా, “ఏడవకు ఏడవకు నాచిట్టి తండ్రీ! ఏడిస్తె నీకండ్ల నీలాలుగారు, నీలాలుగారితే నేజూడలేను, పాలైన గారవే బంగారు కనుల, ముత్యాలు కురియవే నీముద్దు కనుల” అని సాగదీసి రాగాన్ని కృత్రిమంగా సృష్టించి పాడేది కాదు. ఏడ్చినంతసేపూ ఏడ్చి, గుక్కలేక ఓపిక మాలి, పిల్లవాడేడ్వడం మానేసేవాడు—ఇంతలో కృష్ణవేణమ్మ వచ్చి ఎత్తుకోబోయేది. సావిత్రి తన జడల్లుకోవడంలోనో చీరలెన్నుకోవడంలోనో, జీవితాన్ని సమీక్షించుకోవడంతోనో, ఉండిపోయేది. “ఈ పిల్లవాణ్ణి కన్నది నేనుగాదు ప్రసాదరావు”అనే తాత్వికతని ముందుకుతోసి, నవ్వి వేళాకోళంచేసేది. పిల్లవాడు పక్కమీదు న పుడు అదోలాచూచి, ఆ చూపులో నిర్లక్ష్యం,

ప్రేమరాహిత్యం, మూగతనం, వాసనలేని కాగితం పువ్వు దర్పం కనిపించేవి.

ప్రసాదరావు నన్నివిధాల ద్రోహంచేస్తున్నాననే ఊహ విరమించుకొంటూ, కన్నీళ్ళు ప్రవహించినట్టు ప్రవహించి హాస్పిటల్ డ్యూటీకి వెళ్ళిపోయేది.

"అంతమంది తల్లులకి పురుళ్లు పోస్తుందిగదా? తనబిడ్డమీద తనకి శ్రద్ధలేకపోతే యేంకావాలి?" అంది కృష్ణవేణమ్మ.

ప్రసాదరావుకి కావలసింది ఈలాంటి ప్రశ్న కాదు. ఈప్రశ్నకి సమాధానంగా రోషాయితమైన ఒక చూపు సావిత్రిని చూడవలసి ఉంటుంది; మనసులేని మనిషి...కాని, ఆ పైప్రశ్న ప్రతీ వాళ్ళు అడగవలసిందే మరి...!

ఆ ప్రశ్నకి సమాధానం సావిత్రిలో వెదకడం మొదలుపెట్టాడు. సంతృప్తికరమైన చైతన్యం తనకేమూలా దృగ్గోచరంకాలేదు. ఆ అసంతృప్తినే చాటుతూ, "భౌతికమైన వాంఛలకి విపరీతమైన ప్రకృతిశీలి మాతృత్వ హృదయం, శూన్యంలో కడుక్కుని చీకటిలో అదృశ్య మౌతోంది" అన్నాడు.

కృష్ణవేణమ్మకి భాష అర్థంకాక, భావాన్ని అవకాశంలో వెదకసాగింది. నీడనీడలుగా, భావాలు పరుగులుపెడుతున్నయ్! ప్రసాదరావు కవిమల్లే భాషించడం వింతగొలిపింది. ప్రతీ మానవుడిలో అడుగడుగునా, కవిత్వపు పొరలుంటాయనీ, అవి తెరచుకొన్నపుడే కవిత్వ సత్యం గోచరిస్తుందనీ...

కృష్ణవేణమ్మ మళ్ళీ అడిగింది.

"రేపు చాలా చిక్కులుపడతారు సుమా! పిల్లవాడు మీవాడుకాకపోవచ్చు. చంటిపిల్ల తత్వం పెరిగే వాతావరణంలో ఒక రకంగా వుంటుంది" అంది.

ప్రసాదరావు జవాబివ్వలేదు. పిల్లవాణ్ణి చేతుల్లోకి తీసుకొన్నాడు. తొనల వళ్లు!... జాగ్రత్తగా పాలుతాగి, ఎక్కడయితేనేం—ఏ వళ్లోనో పెరుగుతున్నాడు-పసినిగ్గు!... బుగ్గల్లో గూళ్లు కట్టుకొన్న సిగ్గు... అంతా సావిత్రి ముఖమే! సావిత్రి పెదవులు, సంధ్యలు చిందిన చెక్కిళ్ళలో ఆ సమయ సూర్యాకాశపు నిద్రముద్రలు వేసుకుని మూస్తాడు. కళ్ళల్లో తారకాకాంతి, పుంజీభవించి కరుగుతో వుంటుంది!

తనలో తనకే తెలీని, ఆనంద వాత్సల్యం ప్రవాహరూపేణా ఉప్పొంగింది. క్రమేణా సాగరమైంది—పుత్రప్రేమ అంటే, అంత సంతోషం ఆనందవర్షిష్ణువూ, అదే ప్రబల సత్యం గోచరిస్తున్నట్టు తోచింది!

మెల్లగా అడుగులచప్పుడు వినిపించింది. విరహాహృదయంలా దీపం మండుతోంది. సావిత్రి పిలుస్తూ లోపల అడుగు పెట్టింది.

"నీకు పిల్లల్ని పెంచడం చేతకాదు సావిత్రీ! మళ్ళీ మంత్రసానివి" అన్నాడు.

"నాకు సర్టిఫికేట్లు లేవు. నేను పిల్లవాణ్ణి వద్దన్నాను. ఈ బరువూ బెడదా నా నెత్తిన వేయవద్దన్నాను. మీరు విన్నారా? నాకుపిల్లల్ని పెంచడంవచ్చునని, మీకు ఋజువుచేయనవసరం లేదు. నాకేంమాత్రం బాధ్యతల్లేవు."

మాట్లాడ్డానికి వీల్లేదని ఆమె ప్రతిమాట కాపలా కాస్తోంది ఆడదానికి, పిల్లల్ని పెంచే బాధ్యతల్లేవంటే తను నోరు మూసుకోవాలి సొచ్చింది!

అదోలా నవ్వుకున్నాడు. వెన్నెల కాచినట్టయింది... ఎంతకాస్తేనేం? అడవిగాచిన వెన్నెల సావిత్రి సౌందర్యాన్ని తోడుకున్న పిల్లవాడు.. అయినా, ఏదో గ్రొత్తందాల్చి, సావిత్రి ఋణం తీర్చుకున్నాడు. ఇంకా సావిత్రీ ప్రసాదరావులకి ఋణానుబంధం వుంది!...

ఆ మసకవెలుగులో సావిత్రి మరింత అందంగా అనుతోంది. కళ్లు నక్షత్రకళల్ని కోరుకుంటున్నయ్! శరీరపు తళుకూ, బెళుకూ ప్రకృతిలో రంగుల్ని రంగరించుకొంటోంది. కోలమొహం, కోమలఫణితీ, ప్రసాదరావుని పురికొల్పుతోంటే అసహాయంగా చేతులుచాచాడు. హృదయానికి ఉప్పెనలా ఒక్క పొంగు!... అది యౌవన రుచి తీరేదాకాను!

సావిత్రి చేతుల్ని తోసివేస్తూ, "ఇది అదనూ, అందంకాదు. వెళ్ళండి ఏభగవద్గీతయినా చదువుకోండి" అంది.

"వాంఛకతీతులం కాలేం! భగవద్గీతచెప్పినా అంతే" అన్నాడు.

ఆ వెలుగులో జిలుగులు మిలమిలలాడినయ్! ప్రకృతి సృష్టిరహస్యాల్ని సమీక్షించి రాలుస్తోంది. నక్షత్రాలు చరిత్రలో అంతస్థుల్ని పరిశీలిస్తున్నాయ్! కళ్ళులేనిగ్రుడ్డివాడికి చీకటీవెలుగూ ఉదయమూసంధ్యా, బ్రతుకూమెతుకూ, తెలుపూ నలుపూ అంతా ఒక్కలాగే కనిపిస్తున్నది. యౌవనము క్షీణిస్తున్నప్పుడంతా నోరు తెరచి వేదాంతాన్ని అరుస్తారు!...గూళ్ళల్లో పిట్టల రెక్కల సవ్వడికి లేచినఆకులు గాలికి అల్లల్లాడుతున్నయ్.

* • *

రాత్రి మిట్టపల్లాల్ని దాటి కరిగి తెల్లగా ప్రవహిస్తోంది. తూర్పుకొండ తెల్లకల్లువలు, మబ్బుంచుల మీంచి జారుతున్నయ్!

ప్రసాదరావులో మార్పులేదు. నాటికీ నేటికీ ఉన్నచోటనే ఉన్నానంటాడు. నిజంగా వ్యక్తి మార్పు కోరడు. మార్పు తనంతతాను వచ్చి మీద పడితే, ప్రత్యక్షసత్యంగా పలకరిస్తే వద్దనలేడు. మార్పువచ్చి బలవంతంగా మీద పడుతూ, "నీ మీద పడతాను. నువ్వు మారిపో! పోకతప్పదు" అని ఎదుర్కొంటే, మానవుడు సంగ్రామానికి సిద్ధపడతాడు. అడుగడుగునా ప్రతిఘటించి, ఒక్క చదరంగపు పెత్తులో ఓడిపోతాడు. మార్పుఎవరూ కోరరు, అయితేనేం? సహిస్తారు! ప్రకృతినైజం కనుకనే మార్పు సహజం!

అందుకేనేమో? ప్రసాదరావు మార్పు కోరలేదు. అదితనంతతాను రానూలేదు. ఉద్యోగంలో లేదు. జీతంలో లేదు. జీవితంలోలేదు. జీతం—జీవితం... ఎంత సన్నిహిత బాంధవ్యం కల పదాలు! సావిత్రి మార్పుకోరింది. "ఛీ! ఎంత కాలం జీవించినా ఇంతేనా? మార్పులేకండా" అని జీవితనైరాశ్యాన్ని, ఒక్కనిట్టూర్పులో ఇమిడ్చి విడిచేది.

పిల్లవాడిపేరు 'ఉమాశంకర్'-ఒక్కసారైనా సావిత్రి నోరారాపిలిస్తే, ఆ తత్త్వంవేరు! పిలవలేని జాడలో పిల్లవాడు అక్కరలేనిచోట పెరిగాడు. ఏళ్లు దాటుతున్నాడు. జ్ఞానం పువ్వుమల్లే పరిమళిస్తోంది.

రోజూ, మంత్రసాని పదవి నిర్వహించి వచ్చేసరికి కొండంత అలస్యాన్ని భరిస్తూవచ్చేది. పిల్లవాణ్ణి చూచేసరికి ఏదోఅజ్ఞాతశక్తి జ్ఞప్తిలో మసిలి భయపెట్టేది. భయపడుతూనే, చేతులు చాచేది. పిల్లవాడు విదలించుకొని పారిపోయేవాడు. కృష్ణవేణమ్మ దగ్గిర చనువునిబట్టి, ఆమెని పిల్లవాడు 'అమ్మా' అని పిలుస్తోంటే, తనని 'రాక్షసీ...' అని పిలుస్తోన్నట్టనిపించింది.

ప్రసాదరావు కృష్ణవేణమ్మకి నాల్గయిదు సార్లు పిల్లవాణ్ణాదించడంచూచి, సావిత్రితల తిరిగిపోయింది. పిచ్చిగా కేకలేస్తూ, ప్రసాదరావుమీద విరుచుకుపడింది. హాస్పిటల్‌కి రమ్మని పిల్లవాడికి చేయి అందిస్తే, దూరంగా భారంగా కాలికొద్దీ పరుగుతీసి, హేళనగా బిక్కబిక్కమని చూస్తూ భయావహంగా నిలుచుండిపోయేవాడు.

ఒకనాడు బలిమిని, దగ్గరగా లాక్కొని ముద్దుపెట్టుకొని, నేత్రాంతర్గత లోకాల్లోకి ఉత్తీవ్రదృగంతాలతో సమీక్షించింది. ఆ ఈక్షలో అనంతమైన ప్రేమిక శక్తి మంగళసూత్రాన్ని బంధిస్తోంది. ప్రేమలేని హృదయానికెంత శక్తిహీనత వుంటుందో గణించలేం. "నువ్వు నవ్వు" అంది. పిల్లవాడు ప్రపంచం భ్రమించినట్టు ఏడ్చాడు. గిజాయించుకొని కిందికి దిగి, "నువ్వు మంతరసానివి" అన్నాడు, వచ్చీరాని మాటల్లో. సావిత్రి ఆ మాటల్లో ముద్దుతనాన్ని చూరగొంటూ కౌగలించుకొని తనివితీరని హృదయోద్వేగంతో మథనపడుతూ ఆనందమాధుర్యాన్ని అనుభవించసాగింది. పిల్లవాడి చెక్కిళ్ళ జలదరించి వేడెక్కినయ్!

కళ్ళు మూసుకుని, అవ్యక్తబాధలో గొంతెత్తి రోదించాడు. ఆ రోదన మృత్యులోక రోదసీకుహరాన్ని ఆశ్రయంకోసం, దగ్గరికిపిలిచినట్టుంది. అతీతమైన మానవశక్తిని గెలిచి, సాధించేదేముందని గేలి చేస్తున్నట్టుంది.

పిల్లవాడు ఏడవడం కృష్ణవేణమ్మ హృదయాన్ని గాయపరచినట్టయింది. వెంటనే పరుగెత్తుకొంటూ వచ్చి, "ఏడుస్తున్నాడేమమ్మా! పళ్లు వెచ్చగిలింది. మనసు రాపాడినట్టయింది. ఎంత బేజారెత్తిపోయాడో పిల్లాడు" అంది.

సావిత్రి రోషిస్తూ, "పిల్లవాణ్ణి వదిలేయండి! వీడు నాబిడ్డ" అంది.

కృష్ణవేణమ్మకంఠాన్ని విడవకండా పిలవాడు

కళ్లుమూసుకుని, చీకటిని ద్వేషిస్తూ, వెలుగుని ప్రేమిస్తున్నాడు.

ప్రసాదరావు వచ్చిన జాడల్ని గ్రహించి కృష్ణవేణమ్మ "అబ్బాయికి వళ్లు వేడిచేసింది నాయనా!" అంది.

"ఇవ్వాల్టికి మీ యింట్లోనే పడుకోబెట్టండి! వాడు మీవాడేగాని మావాడు గాదు. పెంచి, పెద్దచేసినవాళ్లకే హక్కు. పెంచలేనివాళ్ళకి దేవుడు పిల్లల్నెందు కిస్తాడు? బుద్ధిమాలిగాని-" అన్నాడు ప్రసాదరావు.

నక్షత్ర నక్షత్రానికీమధ్య మహా అగాధపు చీకట్లు. దగ్గరకెంతో చేరికతోనో, పరస్పరా న్యోన్య సహకార స్వభావాలతో నీతి, మతం, అభివృక్కులతో ప్రపంచానికి ప్రదర్శిస్తాయి. అయితే, తారకీ తారకీ నడుమ కొన్ని కోట్ల ప్రపంచా లిమిడిపోవచ్చు. అందుకే ప్రసాదరావు భయపడినా, పిల్లనీ తల్లినీ వేరుచేస్తూ, 'ఇది జన్మ జన్మాల పరిపాక సుకృతం' అనాలిసొచ్చింది.

"మనం పెంచుకోలేకనా? ఇతరులకి, పెంప కాని కిచ్చేశారు. ఈ అడిగే హక్కు నాకు లేదంటారా?"

"ఆ హక్కుని నీవు కోల్పోయావు. గాలిలో వదిలేసి, గాలి బుడగని దగ్గరికి రమ్మంటున్నావు. నీ వెంత శ్రమపడినా నీడల జాడలు తెలీక భ్రమించాలిసిందే! ఆశ లొదులుకోవడంలో వుండే ఔన్నత్యం, ప్రాకులాడ్డంలో లేదు. మానెయ్" అని గర్జించిన ప్రసాదరావు వికటాట్ట హాసంగా నవ్వాడు.

"వాడు నీదగ్గరికి రాడు. నీ శరీరం ముళ్ళ కంపనీ, కంపనీ, వాడు నీదగ్గరికి రాడు. కన్న హక్కుని నీవు తొలగించుకున్నావు—"

"వాళ్లు రేపో యెప్పుడో వెళ్ళిపోతారు కూడా."

సావిత్రి వింటూ వింటూ, "ఉమాశంకర్ని కూడా తీసుకపోతారా?" అని అప్రయత్నంగా అడిగింది.

"తథాస్తు! వాడిపేరు నీకింకా జ్ఞాపకంవుండడం మాతృత్వంలో రికార్డుచేయాల్సిన ఘట్టం."

"వాణ్ణి నేను తీసుకెళ్ళనివ్వను! ఎవరిదా హక్కు? ఏమిటా అధికారం? ఎలా ప్రేరేపిస్తుంది? నా పాదాల్ని తాకి, నా రక్తాన్ని చవిచూచినా తీసుకెళ్ళలేరు."

"నేనిచ్చిన అధికారబలాలతో వెళ్ళిపోతారు. నువ్వాటంకించి, సాధించలేవు. వాళ్ళని వేధించ లేవు. నామాట కాదనకు. నీకు శక్తిలేదు, ఉపాయం లేదు. అందర్నీ బాధించగలవు. అపాయం తెచ్చి పెట్టగలవు—జాగ్రత్త—"

"మీరు లక్ష చెప్పండి! నాబిడ్డతో ఒక్క డుగు ముందువేయలేరు. ఓడిపోతారు. నా రక్తం, నా మాంసం, నా శక్తి, నా సౌందర్యాన్నీ నా యౌవనాన్నీ భాగించుకొని, విభజించుకొని, గుణించుకొన్న గొప్ప హక్కు. జ్వాలలా మాతృ గర్భాన్ని దహిస్తూ, జనించిన బిడ్డ."

ప్రసాదరావు వ్యక్తిత్వాన్నీ శక్తిత్వాన్నీ ఒక ఉప్పెనలా అనుసూనించాడు. తత్త్వం ఎప్పుడు మారుతుంది? కోరిక మీరినపుడు! ఆ కోరిక మమతలమీద వాత్సల్యంమీద సౌందర్యంమీద లిప్తవేసుకొని వుంటుంది. దాన్ని సాధించాలనే ప్రయత్నంలోనే కృతకృత్యులం కావాలి.

"నీ యిష్టం" అని దుప్పటిముసుగు బిగించి పడుకొన్నాడు.

* * *

"వాళ్ళ బిడ్డతో మనకెందుకు?" అన్నాడు కృష్ణవేణమ్మ భర్త. ఒకళ్ళ పొత్తు వాంఛించలేని, అభిమానం మాటల్లో గూడుకడుతూ, ప్రమా దాన్ని సూచిస్తూ, హెచ్చుకున్నాడు.

"ఎరువు పరువు తీస్తుంది—వాళ్ళ యిద్దరి యిష్టంలేకండా ఏముఖంతో తెచ్చావు? మనకు సరిపడదు—సావిత్రి మన స్తత్వం నీకు తెలియందా? ఇచ్చేసిరా! వద్దు మనకీ బెడద. ఈ బరువు నెత్తి మీద మోయలేం. అనవసర విద్వేషాలకీ, ఘృష్ట చైత న్యాలకీ ప్రశాంతవాతావరణంలో తావీయక— అసలు ప్రసాదరావుకధికారం ఏముందికనక" కృష్ణ వేణమ్మ ఈమాటల్లో ఊపిరిపీల్చింది. అందం, ఆనందం ప్రేమానుబంబం కలిగి వాత్సల్యాన్ని ప్రేరేపిస్తున్నబిడ్డ! ముద్దూ ముచ్చటా తీర్చగల బిడ్డని ఈ వ్యవహారంలో కళంకితుణ్ణిచేసి, తీసుకు వచ్చానేమో అనుకొంది. అంతా ఆదోలా మాట్లా డతారు. తాననుకోగలిగింది ఒక్కటే!

పిల్లవాణ్ణి వీధిలోంచి కేకవేశారు.

భర్త చరచరా లాక్కెళ్ళి వీధిలో ఎవరికో అప్పజెప్పి వచ్చేశాడు, ఉమాశంకర్ని—కృష్ణవేణమ్మముఖం నెత్తుటిముద్దయింది. కళ్ళల్లో కన్నీరు కరిగింది. కంటిలో మేఘం వర్షించింది.

"సావిత్రి వచ్చింది. పిల్లవాణ్ణిచ్చేశాను. రిక్షామీద వెళ్ళిపోయింది."—

"పోనీలెండి! మంచిపని చేశారు! అంతకంటె మంచిపని చేయలేం, చేసినా, సమాజం మెచ్చదు."

"లేనిదానికి మనం తాపత్రయపడకూడదు. ఉన్నదానికే మనతాపత్రయాలన్నీ"—

"బయల్దేరండి! ఒక్కనిమిషం ఈవూళ్ళో ఉండడానికి వీల్లేదు."

పెద్ద పెట్టున నిశ్శబ్దం వినిపించింది. స్వప్నంలో మూగబాధలాంటిది. మమతల్నీ, ప్రేమల్నీ తెంచుకొంటూన్న నీరవబాధలాంటిది.

* * *

"మీకెలాంటి అభిప్రాయాలున్నయ్ పిల్లల మీద?"-సావిత్రి వెనుదిరిగి చూచింది. డాక్టరు! ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడని డాక్టరు... తనతో ఏదో మాట్లాడాలని ఉంకిస్తున్నాడు. మాట్లాడకూడదని శంకిస్తున్నాడు.

"మీకెలాంటి అభిప్రాయాలున్నయ్?"ఎదురు ప్రశ్నవేసి వెనక్కు తిరిగింది. ప్రక్కనున్న ఉమాశంకర్ వైపు చూచింది. ఆ చూపులో మూగతనం ప్రకృతిలో ప్రసవవేదన, జ్వాలలోమంటే ఎర్రదనం, నర్తిస్తున్నయ్!

"సంతాననిరోధం అవసరమంటాను"

"డాక్టర్! మీ మాటలు అబద్ధాలు. మీరు మాతృహృదయాన్ని వివరించడంలేదు. మీరు సంతాన నిరోధం అవసరమని, ఎక్కడనాలో అక్కడనండి! నాకు పిల్లలమీద సదభిప్రాయం వుంది. ఇదివరకు నేనేవగించుకొన్నమాట వాస్తవంగా అజ్ఞానంలో. ఇప్పుడు నిజానికీ, నాకూ సన్నిహితత్వం ఏర్పడుతోంది."

"ప్రసాదరావుని నేనెరుగదునుగాని...మీరు మరోవిధంగా మాట్లాడుతున్నారు. మీరేపిల్లవాణ్ణి కన్నారు, పెంచలేదు. కాని ఇతని చిన్ని హృదయాన్ని గాయపరచినవారవుతారు."

"నాకు తెలీదు"—సావిత్రి అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. పిల్లవాడు తనని 'అమ్మా' అని పిలవనక్కర లేకుంటే చాలా అదృష్టవంతురాలు!

పిల్లవాణ్ణి హాస్పిటల్లో పదిమందీ ఎత్తుకొన్నారు రోగులూ, భోగులూ, సంయోగులూ-అందరూ. అందరిదగ్గరకీ వెళ్ళడానికి మారాం చేశాడు. "మంచివాడివనిపించుకో!" అని నాలుగు తగలనిచ్చింది. నలుగురూ నాలుగువిధాలా అన్నారు.

"పిల్లవాణ్ణి క్రిష్ణవేణమ్మ పెంచిందట. ఈవిడ కాదట."

"తీరా పెద్దవాడయాక పిల్లవాణ్ణివ్వను పొమ్మందిట."

"ఇప్పుడు కష్టంలేదుగా! ఉగ్గూ, పాలూ పట్టి నానాయాతనా పడనక్కరలేదుగా."

"సుఖంగా, హాయిగా, ఆటా పాటా చూచి పెంచుకొంటుందిక."

సావిత్రి పిల్లాణ్ణి గదిలోకి తీసుకెళ్ళి, నాలుగు కసితీరా తగలనిచ్చింది. "నీబతుకు బండలైపోనూ! అక్కడెందుకు పెరిగావురా! నాకు మాటలు రావడానికి!" కృష్ణవేణమ్మని శపించింది. తనిలా చేసుకున్నందుకు తపించింది.

నలుగురుదగ్గరకీ వెళ్ళి, "నేనే పెంచాను! నా బిడ్డని నేనే పెంచుకొన్నాను. మరొవాళ్ళు పెంచడానికి వీల్లేదు" అని గట్టిగా గర్జించింది. నలుగురూ నోళ్ళు నొక్కుకున్నారు.

"నీ చేత్తో ఎన్ని పురుళ్ళు పోశావమ్మా! ఎందరి పిల్లల బొడ్డు గోశావూ? నిన్ననడానికి మాకేం పగా!" అన్నారు నలుగురూ...

తనకెక్కడ చూచినా, ప్రశంసలు, అగడ్తలు దాటుతోన్న పొగడ్తలు. సావిత్రి ప్రకృతిలో భ్రమించే వసంతకన్యలా, ఒక్కసారి సౌందర్యంతో ఉప్పెనలా ఉప్పొంగింది. ప్రకృతిమాతః ఎల్లప్పుడూ, మాతృత్వానికి అర్రులుచాస్తుంది!

(ముగింపు వచ్చేసంచికలో)

